

ముందుకు సాగని ఎలక్ట్రిక్ చార్జింగ్ కేంద్రాలు

- 10 చోట్ల ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు
- ఒక్క చోట ప్రారంభమై నిలిచిపోయిన పనులు





ఈవీ స్టేషన్ కోసం కూల్చివేసిన సివిల్ హాస్పిటల్ ప్రహరీ

కరీంనగర్ అర్బన్, మే 22: నగరంలో ఎలక్ట్రిక్ చార్జింగ్ కేంద్రాల పనులు ముందుకుసాగడం లేదు. స్మార్ట్‌సిటీలో భాగంగా 10 చోట్ల ఎలక్ట్రిక్ చార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలంగాణ పునరుత్పాదక శక్తి అభివృద్ధి సంస్థ (రెడ్కో) నిర్ణయించింది. దరఖాస్తులను ఆహ్వానించి 10 చోట్ల చార్జ్ పాయింట్ ఆపరేటర్స్ (సీపీవో)ను ఎంపికచేసి వారితో ఒప్పందం చేసుకుంది. నాలుగు ప్రైవేట్ సంస్థలు ఈవీ స్టేషన్ల ఏర్పాటుకు ముందుకురాగా ఇందులో జోయల్ పాయింట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు -1, శ్రీగణేష్ సర్వీస్ సంస్థకు-3, పి రామాచారి సంస్థకు-5, భవాని ఇంజనీరింగ్ ఏజెన్సీకి-1 వంతున కేటాయించింది. మూడు నెలల్లో ఎలక్ట్రిక్ చార్జింగ్ కేంద్రాల ఏర్పాటు చేయాలని నిబంధన విధించింది. ఒక్కో ఎలక్ట్రికల్ చార్జింగ్ కేంద్రం ఏర్పాటుకు దాదాపు 20 లక్షల రూపాయలు అవసరమవుతాయని అంచనా.

● ఐదు నెలలు గడిచినా..



ఒప్పందం చేసుకుని ఐదు నెలలు సమయం గడిచినా ఒక్కచోట మాత్రమే పనులు ప్రారంభమయ్యాయి. మిగతా తొమ్మిది ప్రాంతాల్లో పనులు ప్రారంభం కాలేదు. సివిల్ హాస్పిటల్ చౌరస్తాలో ఈవీ స్టేషన్ ఏర్పాటు కోసం రెడ్‌కోతో ఒప్పందం చేసుకున్న సంస్థ పనులు ప్రారంభించి అర్థాంతరంగా వదిలి వేసింది. ఆసుపత్రి ప్రహరీని కూల్చి వేసి, స్థలాన్ని చదును చేసి వదిలేయ డంతో ఆసుపత్రిలోకి కుక్కలు, పశువులు వెళుతున్నాయి. ఈవీ స్టేషన్‌కు కేటాయించిన స్థలం మినహా ఎప్పటి మాదిరిగా ప్రహరీని నిర్మించాలని ఆసుపత్రి అధికారులు కోరుతున్నారు. ఈవీ స్టేషన్ల కోసం ఆర్భాటంగా నాలుగు సంస్థలతో అగ్రిమెంట్ చేసుకున్నప్పటికీ కేంద్రాల ఏర్పాటులో జాప్యం జరగడంపై అసంతృప్తి వ్యక్తమవుతున్నది.



పంచాయతీలకు నిధుల కొరత

- సిబ్బందికి జీతాలు ఇవ్వలేని దుస్థితి
- పడకేసిన పల్లె పాలన...కార్యదర్శులకు తప్పని తిప్పలు

కరీంనగర్ రూరల్/ హుజూరాబాద్ రూరల్, మే 22: గ్రామ పంచాయతీ లు నిధుల కొరతను ఎదుర్కొంటున్నాయి. గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. వారికి నిధులు విధుల కేటాయింపుల విషయంలో స్పష్టత లేక పోవడంతో పల్లెల్లో పాలన పడకేసింది. దీంతో కనీసం గ్రామాల్లో సౌకర్యాలు కల్పిం చడంలో ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో పనిభారం మొత్తం పంచాయతీ కార్యదర్శులపై పడుతోంది. కరీంనగర్ రూరల్ మండలంలో 17గ్రామ పంచాయతీలు ఉండగా ప్రతీ గ్రామానికి ఒక కార్యదర్శిని నియమించింది.

ఈ యేడాది ఫిబ్రవరి 1వ తేదీ నుంచి సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో స్పెషల్ ఆఫీసర్ల పాలన మొదలైంది. మండలంలో క్లస్టర్ గ్రామాలుగా ఎంపిక చేసి 10 మంది ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం, స్టేట్ ఫైనాన్స్ ఇచ్చే నిధులు ముఖ్యమైన ఆర్థిక ఆదారాలు కాగా 2022 ఆగస్టు నుంచి ఎస్ఎఫ్‌సీ నిధులు రావడం లేదు. జనాభాకు అనుగుణంగా ఒక్కొక్కరికి 812 రూపాయల చొప్పున 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేయాల్సి ఉండగా అవికూడా రాకపోవడంతో పాలన సాగడం లేదు. దీంతో మేజర్ గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులు వసూలు కావడంతో జీతాలు సమకూరుతున్నాయి. చిన్న గ్రామ పంచాయతీలకు తిప్పలు తప్పడం లేదు. జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు.

మండలంలో 17 గ్రామ పంచాయతీల్లో 103 మంది సిబ్బంది పని చేస్తున్నారు. బొమ్మకల్‌లో ఔట్ సోర్సింగ్ విధానంలో 38 మంది పని చేస్తున్నారు. బొమ్మకల్, నగునూర్, దుర్శేడ్, గోపాల్‌పూర్, చామనపల్లి వంటి గ్రామాల్లో సమకూరిన నిధులతో జీతాలు ఇస్తున్నారు. మిగతా తొమ్మిది గ్రామాల్లో జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. పంచాయతీ సాధారణ నిధులతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సీఎఫ్‌సీ, ఎస్ఎఫ్‌సీ, పీఎంఎస్ నిధులు జనాభా ప్రతిపాదికన ప్రతి నెల రెండు లక్షల నుంచి ఐదు లక్షల వరకు మంజూరయ్యేవి. గ్రామాల్లో వసూలైన ఇంటి పన్నుతో కొన్ని గ్రామాల్లో జీతాలు ఇస్తున్నారు. చిన్న గ్రామ పంచాయతీల్లో మాత్రం జీతాలు ఇవ్వడం కష్టతరంగా మారింది.

● మూడు ఖాతాలు ఖాళీ

గ్రామ పంచాయతీల్లో మూడు రకాల ఖాతాలు ఉంటాయి. ఒకటి ఆస్తి పన్నులు జమ చేసుకునే ఖాతా.. గ్రామాల్లో ఆస్తి పన్ను అంతంత మాత్రంగానే వసూలు అవుతున్నాయి. ఖర్చు నాలుగింతలు ఉండడంతో అవి ఎప్పు డూ ఖాళీగానే ఉంటాయి. రెండోది ఎస్ఎఫ్‌సీ (స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్) ఖాతా.. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ప్రత్యేక గ్రాంట్లు జమ చేస్తారు. ఈ రెండు ఖాతాల్లో జమయ్యే మొత్తం ట్రెజరీ ద్వారా డ్రా చేయాల్సి ఉంటుంది. మూడోది 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించినది. కేంద్ర ప్రభుత్వం నేరుగా పంచాయతీలకు గ్రామ జనాభా ఆధారంగా నిధులు అందజేస్తుంది. ప్రతి నాలుగు నెలలకు ఓసారి ఈ నిధులు విడుదల చేస్తుంది. ఈ నిధులు మాత్రమే పంచాయతీలకు అందుతుండగా వాటిని ప్రత్యేక సూచనల మేరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. స్టేట్ ఫైనాన్స్ నిధులు రెండేళ్లుగా అందడం లేదు. నిబంధనల మేరకు ఖర్చు చేయని నిధులు ఆయా ఖాతాల్లో మిగిలిపోగా, మార్చిలో వాటిని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకుంది.

ప్రజలకు ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకుంటున్నాం

టి సునీత, ఎంపీడీవో, హుజూరాబాద్



గ్రామాల్లో తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా జిల్లా స్థాయి, మండల స్థాయిలో అధికారులకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ప్రత్యేక అధికారులకు అవగాహన కల్పించాం. తాగునీటి సరఫరా విభాగం అధికారులు సైతం దృష్టి సారిస్తున్నారు. కలెక్టర్ ద్వారా విడుదలయ్యే నిధుల ద్వారా కొన్ని నిధులను గ్రామపంచాయతీలకు వినియోగిస్తుండగా, పంచాయతీలకు వచ్చే ప్రత్యేక నిధుల ద్వారా పనులు చేపడుతున్నాం. ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే మా దృష్టికి తీసుకొస్తే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

పంచాయతీలపై భారం పడుతోంది..

సీహెచ్ జగన్మోహన్‌రెడ్డి, కరీంనగర్ రూరల్ ఎంపీవో



గ్రామ పంచాయతీల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు సమకూరక పోవడం, 15వ ఆర్థిక సంఘం నిధులు రాకపోవడంతో గ్రామ పంచాయతీలపై ఆర్థిక భారం పడుతోంది. దీంతో జీతాలు ఇవ్వలేకపోతున్నాం. గ్రామ పంచాయతీల్లో ఉన్న నిధులను మొదటి ప్రాధాన్యంగా జీతాలు చెల్లిస్తున్నాము. ఎనిమిది పెద్ద పంచాయతీల్లో జీతాల సమస్యలేదు. తొమ్మిది చిన్న గ్రామ పంచాయతీల్లో నిధుల్లేక కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదు.

● ఖర్చులకు ఇబ్బందులు

గ్రామపంచాయతీల్లో ట్రాక్టర్ కిస్తీల చెల్లింపు, కార్మికుల వేతనాలు, తాగునీటి సరఫరా నిర్వహణ, విద్యుత్ చార్జీల చెల్లింపు, పారిశుధ్యం తదితర పనుల కోసం నిధులు అందకపోవడంతో గ్రామపంచాయతీల నిర్వహణ ఇబ్బందిగా మారుతుండడంతో గ్రామ పంచాయతీ కార్యదర్శులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. సమస్యలను ప్రత్యేక అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. మేం తాత్కాలికం, నిధులు ఎలా సమకూర్చుకోవాలో మీకే తెలియాలి. ప్రభుత్వం నుంచి నిధులు వస్తే ముందు మీరే తీసుకోవచ్చు. గ్రామంలోనే ఎవరితోనైనా సర్దుబాటు చేయండి అంటూ సలహాలు ఇస్తూ తప్పించుకుంటున్నారని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీల్లో నాలుగు నెలలుగా పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో వారు ఆందోళనకు సిద్ధమవుతున్నారు.





కనుకులగిద్దె, కొత్తపల్లి గ్రామాల్లో అపరిశుభ్రంగా ఉన్న మురికి కాలువలు

భాగ్యరెడ్డి వర్మ స్ఫూర్తిని కొనసాగించాలి



భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూల మాలవేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

సుభాష్‌నగర్, మే 22: అనగారిన వర్గాలకు మెరుగైన విద్యను అందించి విద్య విప్లవం సృష్టించిన భాగ్యరెడ్డి వర్మ స్ఫూర్తిని కొనసాగించాలని కలెక్టర్ పమేల సత్పతి అన్నారు. బుధవారం మాతా శిశు ఆరోగ్య కేంద్రం సమీపంలో ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ భాగ్యరెడ్డివర్మ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని భాగ్యరెడ్డి వర్మ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దళిత బాలికల కోసం పాఠశాలలను స్థాపించి వారి అభ్యున్నతికి గట్టి పునాదులు వేసి మహాత్మ జ్యోతిరావు పూలె వారసత్వాన్ని కొనసాగించిన మహనీయుడని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి నెతానియల్, ఆర్డీవో మహేశ్వర్, ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి మహేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్వల రాంచంద్రం, కార్యదర్శి సాంబారి కొమురయ్య, జిల్లా అధ్యక్షుడు జేరిపోతుల మహేందర్, ప్రధాన కార్యదర్శి జలపతి, ప్రసాద్, సోము పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

డీసీహెచ్ఎస్ కృష్ణప్రసాద్



హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ కృష్ణప్రసాద్

హుజూరాబాద్, మే 22: ప్రభుత్వాస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీసీహెచ్ఎస్) కృష్ణప్రసాద్ అన్నారు. బుధవారం హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని డయాలసిస్, ల్యాబ్, ఫార్మసీ, క్యాజువలిటీ వార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులక అందుతున్న సేవల గురించి ఆస్పత్రి ఏవో డాక్టర్ నారాయణరెడ్డి, డాక్టర్ సోమశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే తప్ప రోగులను వరంగల్ ఎంజీఎంకు రెఫర్ చేయవద్దని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో 24గంటల పాటు వైద్య సేవలు అందుతున్నాయన్నారు. వైద్య సిబ్బంది విధులకు గైర్హాజరైతే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేసినప్పుడే రోగులకు వైద్య సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో డీఎం ముజామిల్‌ఖాన్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

కరీంనగర్ టౌన్, మే 22: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి ప్రారంభం కానున్నాయి. సప్లమెంటరీ పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. 24న ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఫస్ట్ ఇయర్ సెకండ్ లాంగ్వేజ్, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు సెకండర్ ఇయర్ సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష నిర్వహిస్తారు. 25న ఉదయం ఫస్ట్ ఇయ ర్ ఇంగ్లీష్, మధ్యాహ్నం సెకండ్ ఇయర్ ఇంగ్లీష్, 28న ఉద యం ఫస్ట్ ఇయర్ మ్యాథ్స్ పేపర్-1, బాటనీ, పొలిటి కల్ సైన్స్ పేపర్-2, మధ్యాహ్నం మ్యాథ్స్ పేపర్-2 ఏ, బాటనీ పేపర్-2, పొలిటికల్ సైన్స్ పేపర్- 2 పరీక్షలు నిర్వహిస్తారు. 29న ఉదయం మ్యాథ్స్ పేపర్-బి, జూవా లజీ, హిస్టరీ పేపర్-1, మధ్యాహ్నం మ్యాథ్స్ పేపర్-2 బి, జువాలజీ పేపర్-2, హిస్టరీ పేపర్-2, 30న ఉదయం ఫిజిక్స్ ఎకనామిక్స్-పేపర్-1, మధ్యాహ్నం సెకండ్ ఇయ ర్ ఫిజిక్స్ ఎకనామిక్స్ పేపర్-2 నిర్వహిస్తారు. 31న ఉదయం ఫస్ట్ఇయర్ కెమిస్ట్రీ, కామర్స్, మధ్యాహ్నం సెకండ్ ఇయర్ కెమిస్ట్రీ, కామర్స్-2, 1న ఉదయం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, బ్రిడ్జి కోర్సు మ్యాథ్స్- 1, మధ్యాహ్నం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, బ్రిడ్జికోర్స్ మ్యాథ్స్-2, జూన్ 3న మోడ్రన్ లాంగ్వే జ్ పేపర్-1, జియోగ్రఫీ, మధ్యాహ్నం మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్-2, జియోగ్రఫీ పేపర్-2 పరీక్షలు నిర్వహిస్తారు.



● పరీక్షలకు సర్వం సిద్ధం

జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. పరీక్షలకు ఫస్ట్ ఇయర్‌లో 10,073 మంది, సెకండర్ ఇయర్‌లో 4,907 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. మొత్తం 14,980 మంది విద్యా ర్థుల కోసం జిల్లాలో 31 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏడు ప్రభుత్వ, ఒక మైనార్టీ రెసిడెన్షియల్, 23 ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక్కొక్కరు చొప్పున 31 మంది చీఫ్ సూపరింటెండెంట్లను, 31 మంది డిపార్టుమెంటల్ అధికారులను నియమించారు. ఒక డీఈసీ స్క్వాడ్, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్, రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలతోపాటు పోలీసు, రెవెన్యూశాఖల నుంచి కూడా తనిఖీ బృందాలు పరీక్షా కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తాయి. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి, భయాందోళనకు గురికాకుం డా ఉండేందుకు సైకాలజిస్ట్, మానసిక వైద్య నిపుణులు ఫోన్‌లో అందుబాటులో ఉంటారని డీఐఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ఎవరికైనా అవసరమైతే టోల్‌ఫ్రీ నంబర్లు 14416, 18009144 16లో సంప్రదిం చాలని సూచించారు. పరీక్షలకు అన్ని సిద్ధం చేశామని, విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు.

రైతు బాగుంటేనే దేశం ఆర్థికంగా ముందడుగు

కిసాన్ జాగరణ్ అధ్యక్షుడు పి సుగుణాకర్‌రావు

భగత్‌నగర్, మే 22: రైతు బాగుంటేనే దేశం ఆర్థికంగా ముందడుగు వేస్తుందని కిసాన్ జాగరణ్ అధ్యక్షుడు పి సుగుణాకర్‌రావు అన్నారు. బుధవారం కొత్తపల్లి మండలంలోని చింతకుంట రైతు సంఘ భవనంలో కిసాన్ జాగరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు ఉత్పత్తి దారుల సంఘాలు (ఎఫ్‌పిఓ) నిర్వాహకులు, ప్రగతి శీల రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సన్న, చిన్నకారు రైతలు బాగు కోసమే రైతు ఉత్పత్తి దారుల సంఘాలు పని చేస్తాయన్నారు. దేశంలో 84 శాతం రైతులు సన్న చిన్నకారు రైతులేనన్నారు. సన్న, చిన్నకారు రైతుల బాగు కోసం వారిని సంఘటితం చేసి వారే మార్కెటింగ్ చేసుకుని లాభాలు గడించి ఆర్థికంగా ఎదిగే అవకాశాలు ఉన్నాయన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎఫ్‌పీవోలను విత్తన, ఫుడ్ ప్రాసెసింగ్ ఆహార ఉత్పత్తుల కంపెనీలతో అనుసంధానం చేయాలన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాలోని పది ఎఫ్‌పీవోల ప్రతినిధులు, 200 మంది రైతులు, రాజమండ్రి సీటీఆర్‌ఐ సౌంటిస్ట్, మార్కెటింగ్ ఎక్స్‌పర్ట్ డాక్టర్ హేమ, పాలమూరు సీడ్స్ ప్రతినిధి డాక్టర్ అప్పారావు, సిగ్నెట్ సీడ్స్ అధినేత డాక్టర్ సుదేశ్ శర్మ, చింతకుంట ఎఫ్‌పివో అధ్యక్షుడు శంకరయ్య, ఎఫ్‌పీవోల అధ్యక్షులు కూతురు నరసింహారెడ్డి, కమలాకర్‌రావు, పురుషోత్తం రావు, పరుశురాంగౌడ్, బాపురెడ్డి, వెంకటరెడ్డి, పురుషోత్తంరెడ్డి, వేణుగోపాల్‌రావు, రైతు నాయకులు దుర్గం మారుతి, ఇంద్రారెడ్డి, వెంకట్రావు, పరుశురాములు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న కిసాన్‌జాగరణ్ అధ్యక్షుడు పి సుగుణాకర్‌రావు, హాజరైన రైతులు, రైతు ఉత్పత్తి దారుల సంఘాల సభ్యులు

జాతీయ రహదారి పనులను అడ్డుకున్న రైతులు



ఇరుకుల్లలో రహదారి వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

కరీంనగర్ రూరల్, మే 22: మండలంలోని ఇరుకుల్ల గ్రామం సమీపంలో చేపడుతున్న జాతీయ రహదారి పనులను రైతులు బుధవారం అడ్డుకున్నారు. జాతీయ రహదారి నిర్మాణం కోసం సేకరించిన తమ భూములకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. తమకు నష్ట పరిహారం అందించకుండా రోడ్డు వేసుకుంటున్నారని రైతులు ఆరోపించారు. భూసేకరణ జరిపిన అధికారులు ఇప్పటి వరకు నష్ట పరిహారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నష్ట పరిహారం అందజేసిన తర్వాతనే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రెండు మూడు రోజుల్లో డబ్బులు అకౌంట్లలో జమ చేస్తామని అధికారులు చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో కాశిపాక రమేష్, కుంభం శ్రీనివాస్‌రెడ్డి, తారీగొప్పుల సతీష్, న్యాలం సంజీవ్, ఎగుర్ల కనకయ్య పాల్గొన్నారు.











షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

చందుర్తి, మే 22: మండలం మల్యాల గ్రామంలో బుధవారం షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బిటుకు లచ్చయ్య అనే వ్యక్తి భార్యతో కలిసి ఉదయం పొలం పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం లచ్చయ్య ఇంట్లో నుండి ఒక్కసారి మంటలు వచ్చాయి. ఇది గమనించిన స్థానికులు వెంటనే లచ్చయ్యకు సమాచారం అందించారు. గ్రామస్తుల సహాయంతో మంటలు ఆర్పారు. ఇంట్లో నిల్వ ఉంచిన ధాన్యం, మొక్కజొన్న, బియ్యం, ఇతర సామాగ్రి మంటల్లో కాలిపోయాయి. దాదాపు రెండు లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. ఇంట్లోని వాషింగ్ మిషన్ ద్వారా మంటలు వ్యాపించినట్లు పేర్కొన్నారు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

వృద్ధురాలి అదృశ్యం

హుజూరాబాద్‌రూరల్, మే 22: మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన నేరేళ్ల లక్ష్మీ రెండు రోజుల నుంచి కనింపించడం లేదు. కుటుంబస భ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈ మేరకు కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు.







రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

జగిత్యాల టౌన్, మే 22: జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎలుకబావి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. తులసీ నగర్‌కు చెందిన పల్లికొండ రాజయ్య(60) అనే వృద్ధుడు ఇంటి ముందు నిలబడి ఉండగా ఓ బాలుడు మిని వ్యాన్‌ను అజాగ్రత్తగా నడుపుతూ రాజయ్యను బలంగా ఢీ కొట్టాడు. దీంతో రాజయ్య అక్కడికక్కడే మృతి చెందగా పోచయ్య అనే వ్యక్తికి గాయాలు అయ్యాయి. రాజయ్య కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగిత్యాల టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

కోనరావుపేట, మే 22: కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకొని అరెస్టు చేసినట్లు కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పల్లిమక్త గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఆ ప్రాంతానికి వెళ్లి పేకాట ఆడుతున్న జిన్న బాబు, మోకనపల్లి రాంబాబు, ఎనగంటి రమేష్, మోకనపల్లి దేవరాజు, జాగిరి కిరణ్, అలిపిరి ఆనందం లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 2970 రూపాయలను 6 సెల్‌ఫోన్ లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రయాణికులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆర్టీసీ బస్సు డ్రైవర్

వేములవాడ టౌన్, మే 22: వేములవాడ ఆర్టీసీ బస్టాండులో బస్సును నిలిపి సుమారు 40 నిమిషాల పాటు డ్రైవర్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఎపీ 29జెడ్1797 నంబర్‌గల ఆర్టీసీ బస్సును బస్టాండులోని నిలిపి వుంచడంతో ప్రయాణికులు పూర్తిగా నిండిపోయారు. సుమారు 40 నిమిషాలపాటు డ్రైవర్ రాకోవడంతో విసుగు చెందిన ప్రయాణికులు డ్రైవర్‌ను నిలదీశారు. దీంతో డ్రైవర్ ప్రయాణికులపై అనుచిత వాఖ్యలు చేసినట్లు వేములవాడ పట్టణానికి చెందిన పిస్నింటి హన్మాండ్లు తెలిపారు.

పశుగ్రాసం దగ్ధం

ఎల్లారెడ్డిపేట, మే 22: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కిష్టంపల్లి సమీపంలో వ్యవసాయ పొలాల్లో బుధవారం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి పశుగ్రాసం దగ్ధమైంది. సుమారు పది మంది రైతులకు చెందిన 50 ఎకరాల విస్తీర్ణంలోని గడ్డి పూర్తిగా కాలిపోయింది. రైతు నూకల శ్రీనివాస్ వ్యవసాయ పొలంలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు గాలికి ఒకదానికి ఒకటి రాపిడి జరిగే నిప్పురవ్వలు ఎగసిపడ్డాయి. మంటలు ఒక్కసారిగా పంట పొలాలను చుట్టుముట్టడంతో రైతులు చేరుకొని ఆరేందుకు ప్రయత్నించారు.

విద్యుత్ స్టార్టర్లు కరెంటు తీగలు సాగునీటి పైపులు పసుగ్రాసం పూర్తిగా కాలి బూడిద అయ్యాయి. సుమారు రూ లక్ష నష్టం వాటిల్లిందని బాధిత రైతులు పేర్కొన్నారు. వ్యవసాయ పొలాల్లో కిందకు వేలాడుతున్న తీగలను సరిచేయాలని సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించిన పట్టించుకోలేదని వాపోయారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం చోటుచేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇపుంటికైనా కరెంటు తీగలను సరి చేయడంతో పాటు తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.





కళతప్పిన సినారె కళామందిర్


కళావిహీనంగా మారిన సినారె కళామందిరం


పగిలిన సినారె కళామందిర్ కిటికీలు


చెత్తతో నిండిపోయి దర్శనమిస్తున్న కళామందిర్

- చెత్త బండ్లకు నిలయంగా మారిన వైనం
- నూతన భవనానికి మంజూరైన రూ. 5 కోట్లు
- నిధులు సరిపోవని ముందుకు రాని కాంట్రాక్టర్లు
- నూతన భవనాన్ని నిర్మించాలని కళాకారుల డిమాండ్

వేములవాడ టౌన్, మే 22: దేశ విదేశాల్లో ప్రఖ్యాతిగాంచిన విశ్వంభరుడు డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి(సినారే) స్వస్థలం అయిన వేములవాడలో ఏర్పాటు చేసిన సినారె కళామందిరం కళతప్పుతోంది. వేములవాడ ప్రాంతంలోని ఎంతో మంది కళాకారులను సినారే నిర్మించిన కళామందిర్ అక్కున చేర్చుకుంది. అయితే సినారె కళామందిర్ భవనాన్ని మండల పరిషత్ ఆధ్వర్యంలో ఎంపీడీవో మెంటనేన్స్‌ను చూస్తున్నారు. కొంతకాలంగా సినారే కళామందిర్ ఆలనపాలనా లేకపోవడంతో శిథిలావస్థకు చేరకుంది. వేములవాడ మున్సిపల్ కార్యాలయంలోని చెత్తను సేకరించే ఆటోలకు అడ్డాగా మారింది. సినారె కళామందిర్ చెత్తచెదారంతో నిండిపోయింది. వెంటిలేటర్లు పూర్తిగా పగిలిపోయి దర్శనమిస్తున్నాయి. దీంతో సినారె కళామందర్ వద్దకు వెళ్లగానే కంపు వాసన వస్తుందని కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● నిధులు మంజూరైనా..

సినారే కళామందిర్ నూతన భవనం నిర్మాణం చేపట్టేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ చెన్నమనేని రమేష్‌బాబు ఆధ్వర్యంలో టీయూఎఫ్ఐడీ నిధులు ఐదు కోట్ల రూపాయలు మంజూరైనట్లు ఆర్అండ్‌బీ ఏఈ సతీష్ తెలిపారు.

సినారె కళామందిర్ నిర్మాణానికి ఐదు కోట్ల రూపాయలు ఏమాత్రం సరిపోవడం లేదని కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదని తెలుస్తోంది. సినారే కళామందిర్‌కు మంజూరైన నిధులను ఇతర అభివృద్ధి పనులకు మళ్లించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నూతన ప్రభుత్వం ఏర్పాటు చేసిన అనంతరం టీయూఎఫ్ఐడీ నిధులను కొన్ని జిల్లాలో ప్రభుత్వం ఫ్రీజ్ చేసినట్లు తెలుస్తోంది. సినారె కళామందిర్‌కు సంబంధించిన నిధులు ఫ్రీజ్ చేశారా.. అలానే ఉన్నాయా.. అనే విషయం ఆర్అండ్‌బీ ఏఈని అడుగగా తనకు కూడా పూర్తి స్థాయిలో తెలియదని సమాధానమిచ్చారు.

● నూతన భవనాన్ని నిర్మించాలి

- మారం ప్రవీణ్ (పప్పి) కళాకారుడు, వేములవాడ



దేశ, విదేశాల్లో గుర్తింపు పొందిన మహోన్నత వ్యక్తి సినారే, దేశం మొత్తం సినారేను కీర్తిస్తే తన సొంత మండలమైన వేములవాడలో సినారె కళామందిర్ ఆలనపాలన నోచుకోకపోవడం సిగ్గు చేటు. గత ప్రభుత్వం హయాంలో ఐదు కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకుని సినారె కళామందిర్‌ను అత్యాధునికంగా తీర్చిదిద్దాలి.

● సినారేతో అనుబంధం మరువలేనిది

- గూడూరి నర్సన్, గజల్ కవి, వేములవాడ



సినారేతో తన అనుబంధం మరువలేనిది. తనతో సన్మానం పొందిన వాడిగా ఇప్పటికీ మర్చిపోను. వేములవాడలో సినారె కళామందిర్ కళతప్పడం బాధకరంగా ఉంది. సినారె కళామందిర్‌ను అద్భుతంగా నిర్మాణం చేసి గౌరవించాలి. ఈ ప్రాంత కళాకారులు సినారేను ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళుతున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిసారించి సినారే కళామందిర్ నూతన భవనాన్ని త్వరగా నిర్మించాలి.

వైన్ షాపులో చోరీ


సీసీ ఫుటేజికి చిక్కిన అనుమానితుడు

ఓదెల, మే 22: మండల కేంద్రంలోని మల్లికార్జున బ్రాంది షాపులో మంగళవారం రాత్రి గుర్తుతెలియని దుండగుడు చోరికి పాల్పడ్డాడు. అర్ధరాత్రి దాదాపు రెండు గంటల సమయంలో భవనం వెనుక ఉన్న తలుపులను తీసుకొని వైన్ షాపులోకి చొరబడ్డాడు. షాపులో వెతికిన అనంతరం కౌంటర్లో ఉన్న రూ.1.70 లక్షలను ఎత్తుకెళ్లాడు. అలాగే ఒక కవర్లో దాచిపెట్టిన మరో రూ.లక్ష దొంగ కంట పడకపోవడంతో వాటిని అక్కడే వదిలిపెట్టి కౌంటర్లో ఉన్న డబ్బులను ఎత్తుకెళ్లాడు. షాపు యజమాని కాసర్ల స్వామి ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్సై అశోక్ రెడ్డి, ఏఎస్ఐ రత్నాకర్, హెడ్ కానిస్టేబుళ్లు సంఘటన స్థలానికి చేరుకొని ప్రాథమిక విచారణ నిర్వహించారు. అనంతరం సీసీ ఫుటేజీలను పరిశీలించగా దొంగగా అనుమానిస్తున్న గుర్తుతెలియని వ్యక్తి ఫుటేజీలకు చిక్కాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అశోక్ రెడ్డి తెలిపారు.

సమస్యల వలయంలో పీహెచ్‌సీ

- సిబ్బంది కొరతతో రోగుల ఇక్కట్లు
- ఊరికి ఆమడ దూరంలో కొత్తపల్లి ఆరోగ్య కేంద్రం


కొత్తపల్లి ఆరోగ్య కేంద్రం

భగత్‌నగర్, మే 22: కొత్తపల్లి ఆరోగ్య కేంద్రం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. సిబ్బంది కొరతతో రోగులకు సరైన వైద్యం అందని పరిస్థితులు నెలకొన్నాయి. కొత్తపల్లి గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా ఆవిర్భవించినా ఆరోగ్య కేంద్రం పరిస్థితి తీరు మారడం లేదు. కొత్తపల్లి ప్రధాన రహదారి నుంచి మూడు కిలో మీటర్ల మేర లోపలికి వెళితే కాని రోగులకు ఆరోగ్యం అందని పరిస్థితులు నెలకొన్నాయి. కొత్తపల్లి పట్టణంతో పాటు కొత్తపల్లి మండలంలోని వివిధ గ్రామాల నుంచి రోగులు ఆరోగ్య కేంద్రానికి చేరుకోవాలంటే ప్రత్యేకంగా ఆటోను తీసుకుపోవాలి లేదా సొంత వాహనంలోనే రావాల్సి ఉంటుంది. రోగి ఆరోగ్య కేంద్రానికి చేరుకునే సరికే ఉన్న రోగం కాస్త ముదిరే పరిస్థితులు ఉన్నాయి.

● సిబ్బంది కొరత..

కొత్తపల్లి ఆరోగ్య కేంద్రంలో ఉండాల్సిన ఇద్దరు మెడికల్ ఆఫీసర్లకు గాను ఒకరు ఆసిఫ్‌నగర్ మెడికల్ ఆఫీసర్ కాగా, ఒకరు నగరంలోని టీబీ ఆసుపత్రి నుంచి ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. కొత్తపల్లి ఆరోగ్య కేంద్రం కింద నాలుగు సబ్‌సెంటర్లు ఉండగా 8 మంది ఏఎన్ఎంలకు గాను రెండు ఖాళీలు ఉన్నాయి. ఒక స్టాఫ్‌నర్సుతో పాటు, సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మేల్ సూపర్‌వైజర్ డిప్యూటేషన్‌లో ఉన్నారు.

● పత్తాలేని ఆసిఫ్‌నగర్ ఆరోగ్య కేంద్రం నిర్మాణం..

కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్‌కు ఆరోగ్యకేంద్రం మంజూరైనా నడిచేందుకు అనువైన పరిస్థితులు కల్పించడం లేదు. ఆసిఫ్‌నగర్‌లో ఆరోగ్య కేంద్రం భవనం లేక ఇక్కడున్న సిబ్బంది కొత్తపల్లి ఆరోగ్య కేంద్రం నుండే విధులు నిర్వహించాల్సి వస్తున్నది. ఆసిఫ్‌నగర్ ఆరోగ్య కేంద్రంలో ఇరువురు వైద్యులకు గాను ఒకరు మాత్రమే ఉన్నారు. ఆసిఫ్‌నగర్ ఆరోగ్య కేంద్రం కింద ఐదు సబ్‌సెంటర్లకు గాను ఆసిఫ్‌నగర్, ఎలగందల్, కమాన్‌పూర్, చింతకుంటలో పక్కా భవనాలు ఉన్నాయి. నాగుల మల్యాలలో పక్కా భవనం లేదు. ఒక హెచ్ఈఓ పోస్టు, కమాన్ పూర్‌లో ఏఎన్ఎం పోస్టు ఖాళీగా ఉన్నాయి. ఆసిఫ్‌నగర్‌లో ఉండాల్సిన ఫార్మసిస్టు ఒక రోజు వచ్చి డిప్యూటేషన్‌పై వెళ్లిపోయారు. ఆసిఫ్‌నగర్‌లో ఉన్న గ్రానైట్ పరిశ్రమలో పనిచేస్తున్న కూలీలను దృష్టిలో ఉంచుకొనైనా ఆ ప్రాంతంలో ఆరోగ్య కేంద్రాన్ని పక్కాగా నిర్మించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

ఫసల్ బీమా పథకంపై అవగాహన కల్పించాలి

- జాగ్రత్తగా పంటల వివరాలను నమోదు చేయాలి - కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, మే 22: ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. పంటల బీమాతో రైతులకు ఎంతో ధీమా ఉంటుందని పేర్కొన్నారు. బుధవారం కరీంనగర్‌లోని కేడీసీసీ బ్యాంకు సమావేశ మందిరంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనపై ఉమ్మడి జిల్లా వ్యవసాయ అధికారులు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారులు, ఉద్యానవన అధికారులు, ప్రోగ్రెసివ్ రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల వారీగా పంటల వివరాలను వ్యవసాయ అధికారులు జాగ్రత్తగా నమోదు చేయాలని పేర్కొన్నారు. ఫసల్ బీమా యోజన రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పంటలకు నష్టం జరిగినప్పుడు దీని ద్వారా పరిహారం అందుతుందని పేర్కొన్నారు. రైతులు బీమా చెల్లించే అవసరం లేదని, ప్రీమియాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లిస్తాయని వివరించారు. అధికారులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతులు ఆర్థిక అభివృద్ధి చెందేలా కృషి చేయాలని సూచించారు. ఫసల్ బీమా పథకంలో గ్రామం యూనిట్‌గా పరిగణిస్తారని చెప్పారు. పంట దిగుబడి ఆధారంగా, వాతావరణ పరిస్థితుల అనుగుణంగా బీమా నిర్ణయిస్తారని తెలిపారు. దీంతో జిల్లాలో ఎక్కువగా సన్న కారు, చిన్న కారు రైతులు ఉన్నారని, క్లస్టర్ అప్రోచ్ ద్వారా ఎక్కువ మంది రైతులు లాభపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. వ్యవసాయ అధికారులు రైతులకు ఎల్లప్పు డూ అందుబాటులో ఉంటూ సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయంలో అధునాతన పద్ధతులపై ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. హైదరాబాద్ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన జేడీఏ బాలునాయక్ ఫసల్ బీమా పథకంపై అవగాహన కల్పించా రు. మాస్టర్ ట్రైనర్లు మమత, ప్రతిభ, భూంరెడ్డి ఈ పథకంపై ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా సీపీవోలు కొమురయ్య, పీబీ శ్రీనివాస్ పూర్ణచందర్రావు, షబానా సుల్తానా, ఉద్యానవనాధికారులు బి శ్రీనివాసు, జ్యోతి, ప్రతాప్ సింగ్, జగన్మోహన్ రెడ్డి, ఆయా జిల్లాల వ్యవసా య అధికా రులు బత్తుల శ్రీనివాస్, ఆదిరెడ్డి, భాస్కర్, వాణి పాల్గొన్నారు.

● కేడీసీసీ బ్యాంకు సందర్శన

కరీంనగర్‌లోని కేడీసీసీ బ్యాంకును కలెక్టర్ పమేలా సత్పతి బుధవా రం సందర్శించారు. సీఈవో సత్యనారాయణరావు, బ్యాంక్ అధికారులు కలెక్టర్‌కు స్వాగతం పలికారు. కేడీసీసీ బ్యాంకు, పీఏసీఎస్‌ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. బ్యాంకు దేశంలోనే రోల్ మోడల్‌గా మారిందని సీఈవో కలెక్టర్‌కు వివరించారు. చొప్పదండి పీఏసీఎస్ దేశంలోనే అత్యుత్త మంగా నిలిచిందని పేర్కొన్నారు. జనరల్ మేనేజర్లు ప్రభాకర్‌రెడ్డి, ఉషశ్రీ, పీ ఏసీఎస్ డెవలప్‌మెంట్ సెంటర్ రిసోర్స్‌పర్సన్ సత్యనారాయణ, డీజీఎంలు ఏజీఎంలు, తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కూలీ మృతి

కోల్‌సిటీ, మే 22: గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పునాది బెడ్‌పై పడి గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన రావుల విజయ్(47) అనే వ్యక్తి మృతి చెందాడు. కూలీ పని చేసుకుంటూ జీవించే విజయ్ మంగళవారం రాత్రి ప్రభుత్వాసుపత్రిలో ఉన్న తన బంధువులను పరామర్శించేందుకు వెళ్లాడు. మూత్ర విసర్జనకు భవన నిర్మాణం వైపు వెళ్లగా చీకట్లో జారి ర్యాఫ్ట్ ఫౌండేషన్ బెడ్‌పై పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం ఉదయం నిర్మాణ కూలీలు విజయ్ మృతదేహాన్ని గుర్తించి సైట్ ఇన్‌చార్జికి సమాచారం ఇచ్చారు. గోదావరిఖని వన్‌టౌన్ ఎస్ఐ సౌజన్య ఘటన స్థలంలో విచారణ జరిపారు. మృతుని తల్లి రావుల జయశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు.

మట్టిని తరలిస్తున్న టిప్పర్లు సీజ్

పెద్దపల్లి రూరల్, మే 22: జూలపల్లి మండలంలోని అల్లూరు చెరువు నుంచి టిప్పర్‌ల ద్వారా మండలంలోని రాఘవపూర్ ఇటుక బట్టీలకు టిప్పర్‌ల ద్వారా తరలిస్తుండగా తహసీల్దార్ రాజ్‌కుమార్ బుధవారం తనిఖీలు నిర్వహించారు. మట్టిని తరలిస్తున్న టిప్పర్‌లకు అనుమతులు లేకపోవడంతో పాటు, వే బిల్‌లు లేవని దీంతో ఎనిమిది మట్టి టిప్పర్లను సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. వారి వెంట ఆర్ఐలు నవీన్‌రావు, ఇంతియాజ్‌లతో పాటు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

వైభవంగా భూనీలా సమేత లక్ష్మీనృసింహస్వామి కల్యాణం

- నాంపల్లి గుట్టపైన అంగరంగా వైభవంగా నిర్వహణ - భారీగా తరలివచ్చిన భక్తులు


ఉత్సవమూర్తులను కల్యాణవేదికకు తీసుకువస్తున్న అర్చకులు, అధికారులు


మంగళసూత్రాలను చూపిస్తున్న అర్చకులు


కల్యాణానికి హాజరైన భక్తులు

వేములవాడ టౌన్, మే 22: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి అనుబంధ ఆలయమైన నాంపల్లి శ్రీభూనీళా సమేత లక్ష్మీనృసింహస్వామి వారి కళ్యాణాన్ని బుధవారం ఆలయ అర్చకులు, అధికారులు అంగరంగా వైభవోపేతంగా నిర్వహించారు. రాజన్న ఆలయ అర్చకులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో కన్యదాతలుగా రాచకొండ రామాచార్యులుసంధ్య రాణి ఆధ్వర్యంలో అర్చకులు విజయసింహచారి, రామకృష్ణచారి, హర్షవర్ధన్‌లు వేద మంత్రాలతో కళ్యాణతంతును కన్నుల పండువగా చేపట్టారు. నాంపల్లి గుట్టపైన కొలువుదీరిన శ్రీస్వామి వారి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా ఆలయం క్రింది భాగంలోని కళ్యాణ వేదికవద్దకు బాజాభజంత్రీలతో తీసుకువచ్చారు. ఊరేగింపు సమయంలో సేవాదారులు, భక్తుల నిర్వహించిన కోలాటం ఎంతగానో ఆకట్టుకుంది. స్వామి వారి కల్యాణంలో భాగంగా రాజన్న ఆలయ ఏఈవో బ్రమ్మన్నగారి శ్రీనివాస్ స్వామి వార్లకు పట్టువస్త్రాలను అందజేశారు. కల్యాణమహోత్సవానికి నాంపల్లి గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. భక్తులకు ఉచితంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో శ్రీనివాస్, ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, సూపరిండెంట్‌లు సరిగిరి శ్రీరాములు, అల్లి శంకర్, నాంపల్లి గుట్ట ఆలయ ఇన్‌చార్జ్ నరేందర్ అధికారులు శ్రీనివాస్, మాధవరావుతో పాటు భక్తులు పాల్గొన్నారు.

నల్లగొండలో..

కొడిమ్యాల: మండలంలోని నల్లగొండ గ్రామ శివారులో వెలిసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో నర్సింహస్వామి జయంతిని పురస్కరించుకొని బుధవారం స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారిని భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ప్రసాదం వితరణతో కార్యక్రమాన్ని ముగించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ కమలాకర్, యాగ్నీకుడు శ్రీనాథ చార్యులు, అర్చకులు శ్రీనివాసాచార్యులు, రజినీకాంతాచార్యులు, మనోజ్‌కుమారాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీర్‌పూర్: బీర్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కొండపైన ఉన్న లక్ష్మీ నరసింహుని ఆలయంలో ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాన్ని అర్చకులు నిర్వహించగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. సాయంత్రం స్థంబ ఆవిర్భావ పూజలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్, చైర్మన్ ఎనగంటి సామ్రాట్, అర్చకులు సంతోష్, మధు కుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యాపారి ఆత్మహత్య


రమేశ్ (ఫైల్)

సిరిసిల్ల క్రైం, మే 22: సిరిసిల్ల పట్టణంలోని శివనగర్‌కు చెందిన చింతోజు రమేశ్ (43) అనే ఎలక్ట్రికల్ వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి వివరాల ప్రకారం... బుధవారం ఉదయం రమేశ్ అనే ఎలక్ట్రికల్ వ్యాపారి షాప్ తెరిచి స్నేహితులను కలిసి ఇంటికి వెళ్లి ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. శివనగర్‌కు చెందిన రమేశ్ కోర్టుకు ఎదురుగా శ్రీరామ ఎలక్ట్రికల్ షాప్ నిర్వహిస్తు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య కళ్యాణి, ఇద్దరు కొడుకులు ఉన్నారు. కొంతకాలంగా షాప్ సరిగా నడవకపోవడంతో దాదాపు 20లక్షల రూపాయల వరకు అప్పులు పాలయ్యాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆస్తుల పంపకంలో తల్లిదండ్రులతో కలహాలు మొదలయ్యాయి. వారం క్రితం భార్య, పిల్లలు తల్లిగారింటికి వెళ్లారు. ఇళ్ల పంపకం విషయంలో కుటుంబసభ్యుల మధ్య గొడవలు ఏర్పడడంతో మనస్తాపం చెందిన రమేశ్ ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంఘటనా స్థలాన్ని టౌన్ ఎస్ఐ శ్రీనివాసరావు పరిశీలించి పంచనామా చేశారు. తన భర్త ఆత్మహత్యకు అత్త, మామలు, మరిదే కారణమని, తన పిల్లలకు ఆధారం చూపాలని భార్య కళ్యాణి వేడుకుంది. దీంతో రమేశ్ మృతదేహానికి పోస్టుమార్టం చేయడంలో జాప్యమైంది. చివరికి ఇళ్లు ఇవ్వ డానికి రమేశ్ తల్లిదండ్రులు అంగీకరించడంతో పోస్టుమార్టం అనంతరం రాత్రి అంత్యక్రియలు పూర్తయ్యాయి. ఎలక్ట్రికల్ అండ్ హార్డ్‌వేర్ వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడడంతో వ్యాపారులు, స్నేహితులు, కుటుబసభ్యులు చేరుకొని విలపించడం కలిచివేసింది. భార్య కళ్యాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రఘుపతి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

ఎండపల్లి, మే 22: మండలంలోని మారేడుపల్లి గ్రామానికి చెందిన తనుగుల రామయ్య(51) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్సపొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మారేడుపల్లి గ్రామానికి చెందిన తనుగుల రామయ్య, అతడి భార్యతో కలిసి మూడు రోజుల క్రితం తన బిడ్డ ఇంటికి కుక్కలగూడూర్‌కి బైక్‌పై వెళుతుండగా పెద్దపెల్లి జిల్లా పాలకుర్తి మండలం వేంనూర్ గ్రామంలో రెండు బైకులు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో తనుగుల రామయ్య, కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రాగంపేట గ్రామానికి చెందిన ధీకొండ మహేందర్‌కు తీవ్రగాయాలయ్యాయి. మహేందర్ మంగళవారం మృతి చెందగా, రామయ్య చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

మానకొండూర్, మే 22: మండలంలోని మద్దికుంట గ్రామానికి చెందిన మల్యాల లక్ష్మయ్య అనే గీత కార్మికుడు తాటిచెట్టు పైనుంచి పడి తీవ్రగాయాల పాలయ్యాడు. లక్ష్మయ్య ఎప్పటి లాగే కల్లు గీయడానికి బుధవారం తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడి పోయాడు. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

కొడిమ్యాల, మే 22: మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన ఒంటెద్దు బాబు(50)అనే వ్యక్తి మంగళవారం సాయంత్రం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కొడిమ్యాల హెడ్ కానిస్టే బుల్ అర్జ రాజు బుధవారం తెలిపారు. హెడ్ కానిస్టెబుల్ తెలిపిన వివరాల మేరకు హమాలి పని చేసుకొని జీవిస్తున్న బాబు కొంత కాలంగా తాగుడుకు బానిసై మంగళవారం ఉదయం కూలీ పనికి వెళ్లి తాగిన మైకంలో గుర్తు తెలియని క్రిమి సంహారక మందు తాగాడు. అతనిని కుటుంబ సభ్యులు చికిత్స కోసం జగిత్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మృతుని భార్య ఒంటెద్దు పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

రూ. 7,450 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మే 22: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7450 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 24మంది రైతులు 326క్వింటాళ్ల విడి పత్తి, 16మంది రైతులు ఎనిమిది క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7450, కనిష్ఠ ధర రూ.5వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులు మృతి


ప్రమాదంలో దెబ్బతిన్న కారు


ఖైరుద్దీన్(ఫైల్), రషీద్(ఫైల్)

మేడిపల్లి/మెట్‌పల్లి మే 22: జగిత్యాల జిల్లా మేడిపల్లి మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహమ్మద్ రషీద్ (60) అతని తండ్రి ఖైరుద్దీన్(85) మృతి చెందారు. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. రిటైర్డ్ ఉద్యోగి ఖైరుద్దీన్ వృద్ధాప్యరీత్యా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండగా వైద్య పరీక్షల కోసం కొడుకు రషీద్ కారులో కరీంనగర్‌లోని ఆసుపత్రికి వెళ్లాడు. వైద్య పరీక్షల అనంతరం తిరిగి మెట్‌పల్లి బయలుదేరారు. ఈ క్రమంలో మేడిపల్లి మండలం సమీపంలో ఎదురుగా వస్తున్న కారును తప్పించబో యి ప్రమాదవశాత్తు కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ప్రమాదంలో తండ్రీకొడుకులు ఖైరుద్దీన్, రషీద్ అక్కడికక్కడే మృతి చెందారు. రషీద్ మెట్‌పల్లి మండలంలో ప్రభుత్వ టీచర్‌గా పని చేస్తున్నాడు. మృతుడు రషీద్ భార్య నస్రీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై రవీందర్‌రావు తెలిపారు. మెట్‌పల్లి సీఐ నవీన్, కథలాపూర్ ఎస్సై నవీన్‌కుమార్ పంచనామా నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, మే 22: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని ఓ పెట్రోలు బంక్ సమీపాన కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో మండల కేంద్రానికి చెందిన కట్టె కోత మిషన్ నిర్వాహకుడు సంతోష్ తీవ్ర గాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని మండల కేంద్రంలోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. సంతోష్ తన బైక్‌పై ఎల్లారెడ్డిపేట నుంచి గొల్లపల్లికి వెపుకు వెళుతున్నాడు. అటు వైపు ద్విచక్రవాహనంపై వెళుతున్న మరో యువకుడు ఒక్కసారిగా పెట్రోల్ బంక్ వైపుకు మలుపడంతో ప్రమాదం జరిగింది. సంతోష్ చేయి విరగడంతో పాటు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

కొమురవెల్లి ఎస్ఐ నాగరాజు సస్పెన్షన్

చేర్యాల/సిరిసిల్ల క్రైం మే 22: రెండో వివాహం చేసుకున్నాడన్న ఆరోపణలపై కొమురవెల్లి ఎస్ నాగరాజుపై పోలీసుశాఖ ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటువేశారు. ఈమేరకు మల్టీజోన్-1 ఐజీ రంగనాథ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసిన ట్లు విశ్వసనీయంగా తెలిసింది. తనను వేధించడమే కాకుండా పిల్లలను తీసుకునివెళ్లి అందుబాటులో లేకుండాపోయాడని, ఇతర మహిళను రెండో వివాహం చేసుకున్నాడని పేర్కొంటూ ఎస్ఐ నాగరాజు భార్య మానస మంగళవారం రాత్రి కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి బంధువులతో కలిసి ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై సిద్దిపేట సీపీ అనూరాధ ఇచ్చిన నివేదిక మేరకు ఉన్నతాధికారులు ఎస్ఐ నాగరాజుతో పాటు ఈకేసులో భాగస్వామిగా ఉన్న ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేశారు.

'విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలి'

కరీంనగర్ టౌన్, మే 22: పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు, సౌకర్యాలతో కూడిన విద్యను అందించే దిశగా ప్రభుత్వం చేపడుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులు నూటికి నూరు శాతం పూర్తి కావాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో విద్యాశాఖ, ఆర్ అండ్‌బీ, ప్రత్యేకాధికారులతో అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనుల ప్రగతి, మంచినీటి సరఫరా, విద్యార్థుల ఏకరూప దుస్తుల తయారీ తదితర అంశాలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌తో కలిసి కలెక్టర్ పమేలా సత్పతి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలలను బడిబాట కార్యక్రమం కొరకు ముందుగానే సంసిద్ధంగా ఉండాలన్నారు. 345 జిల్లాలో పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పనులకు శ్రీకారం చుట్టగా కొన్ని పాఠశాలలో పనులలో నిర్వహించే పనులలో విద్యాశాఖ అధికారుల ప్రమేయం ఉండడం లేదని, పనులను పూర్తి చేయడంలో అధికారులు పూర్తి నిబద్ధతతో వ్యవహరించాలని ఆమె సూచించారు. విద్యార్థులకు సంబంధిత పాఠశాలలో తీసుకున్న కొలతల ఆధారంగా ఏకరూప దుస్తుల తయారు కావాలని వాటిని హెచ్‌ఎంలు పర్యవేక్షించాలని. దుస్తుల తయారీలో నాణ్యతను తప్పక పాటించాలని ఆయన సూచించారు. జూన్ 10లోగా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ అమ్మఆదర్శ పాఠశాలలకు సంబంధించిన ప్రతి పనిని రికార్డులలో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డిఈఓ జనర్ధన్ రావు, ఈఈ ఆర్ అండ్ బి శ్రీనివాస్, ప్రత్యేకాధికారులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

కరీంనగర్ టౌన్, మే22: అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా సీతారాంపూర్‌లో స్వయం సహాయక సంఘ ఆధ్వర్యంలో స్కూలు యునిఫారం కుట్టుచున్న కుట్టు కేంద్రాలను బుధవారం అదనపు కలెక్టర్ (లోకల్ బాడీల్) ప్రవుల్ దేశాయి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మునిసిపాలిటీల పరిధిలో గల 121 స్కూల్లకు సంబందించి 10,396 మంది విద్యార్థిని, విద్యార్థులు కలరని, వారికి అవసరమగు యూనిఫారం కేటాయించబడిన మెటీరియాల్ ఏరియా లెవల్ ఫెడరేషన్ లకు అందించడం జరిగింది. ఇట్టి యూనిఫారంలు కుట్టుట సకాలంలో పూర్తిచేయాలని స్వయం సహాయక సంఘ సభ్యులకు ఆదేశించారు. జి.స్వరూప రాణి, ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇంచార్జి మెప్మా మాట్లాడుతూ నిర్ణీత సమయములో సంబంధిత స్కూళ్లకు యూనిఫాంలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో శ్రీవాణి, డిఎంసి, అనిత, టిఎంసి, సిఓలు, సంబందిత ఏరియా లెవల్ ఫెడరేషన్ సభ్యులు పాల్గొన్నారు.

'ఉన్మాదులను కాపాడే ప్రయత్నం'



మాట్లాడుతున్న జాతీయ ఎస్సీ పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు దావు సంతోష్

సుభాష్‌నగర్, మే22: ముస్లిం యువతిని ప్రేమించాడని దళిత యువకుడిపై విచక్షణ రహితంగా దాడికి పాల్పడిన ఉన్మాదులను కాపాడే ప్రయత్నం చేస్తునారని జాతీయ ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు దావు సంతోష్‌కుమార్ ఆరోపించారు. బుధవారం నగరంలోని ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో దళితులపై ముస్లింల దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ఆరోపిం చారు. దళిత సామాజిక వర్గానికి చెందిన భరత్ అనే యువకుడు ముస్లిం అమ్మాయి గత కొద్ది సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారని తెలిపారు. అట్టి యువతిని బైక్‌పై తీసుకెళ్తు రేకుర్తి వద్దకు రాగా కొందరు ముస్లిం యువకులు వారిని అడ్డగించి బందించి డిప్యూటి మేయర్, యంఐయం నాయకుడు అబ్బాస్ సమీ వద్దకు తీసుకెళ్ళగా అక్కడ భరత్‌పై విచక్షణ రహితంగా దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. కొందరు ఈ సంఘటనతో అబ్బాస్ సమీకి సంబంధం లేదంటూ మాట్లాడుతూ, భజరంగ్‌దళ్ కార్యకర్తలను విమర్శిస్తు యంఐయం కార్యకర్తలను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈసమావేశంలో శేఖర్, శ్రీకాంత్, అనిల్, అంజి, చిరంజీవి, దాన కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల యూనిట్ల డీడీలు వాపస్ వచ్చేదెప్పుడో?

మానకొండూర్, మే 22: గొర్రెల యూనిట్ల డీడీలు ఎప్పుడు వాపస్ వస్తాయోనని లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ కార్యక్రమంలో భాగంగా రెండో విడతలో మండలంలో 859 యూనిట్లకు లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నారు. ఒక్కొక్క లబ్దిదారుడు యూనిట్‌కు రూ.43,750లను డీడీల రూపంలో గత ప్రభుత్వానికి చెల్లించారు. కాగా ఇందులో 156 మందికి యూనిట్లు మంజూరు కాగా 703 యూనిట్లు మంజూరు కాలేదు. దీంతో లబ్దిదారులు నెలల తరబడి గొర్రెల యూనిట్ల కోసం ఎదురు చూశారు. ఇటీవల రాష్ట్రప్రభుత్వం కరీంనగర్ జిల్లాలో 2686 యూనిట్ల డీడీలు వాపస్ ఇస్తున్నట్లు ప్రకటించింది. అప్పటి నుంచి డీడీలు ఎప్పుడు వస్తాయోనని కట్టిన వారు ఎదురు చూస్తున్నారు.

దళితుల అభ్యున్నతికి పాటుపడిన భాగ్యరెడ్డి వర్మ



హుజూరాబాద్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

కరీంనగర్ అర్బన్, మే 22: దళితులు, అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహోన్నత వ్యక్తి భాగ్యరెడ్డి వర్మ అని టీపీసీసీ ఎస్సీసెల్ సీనియర్ వైస్ చైర్మన్ వెన్న రాజమల్లయ్య పేర్కొన్నారు. బుధవారం డాక్టర్ భాగ్యరెడ్డి వర్మ 136వ జయంతిని పురస్కరించుకుని కరీంనగర్ మతాతాశిశు కేంద్రం వద్ద ఆయన విగ్రహానికి రాజమల్లయ్య పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులు, అణుగారినవర్గాల వారికి విద్యనందించి వారి అభివృద్ధికి కృషి చేసిన గొప్పవ్యక్తిగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం భాగ్యారెడ్డి వర్మ జయంతి వేడుకలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సొల్లు బాబు, పాక సతీష్, కొలిపాక సమ్మయ్య, ఆలేటి రవీందర్, యేముల పుష్పలత, సుంకరి రాజేందర్, ఉప్పు శ్రీనివాస్, జూపాక మల్లేశ్వరి, బత్తుల మనోజ్, అచ్యుత్, కండె తిరుపతి, కోడెం నర్సింగం, తోగర్ స్వామి, ముక్క రమేష్, మురాటి నరేష్, చందు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప పట్నాలు



బీరప్ప పట్నాల్లో పాల్గొన్న భక్తులు

చొప్పదండి, మే 22: చొప్పదండి పట్టణంలో కురుమ యాదవుల ఆరాధ్య దైవమైన బీరప్ప మహంకాళి ఉత్సవాల్లో భాగంగా బుధవారం బీరప్ప నాగవెల్లి పట్నాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగబోనం, పాలాభిషేకం, సుంకు పట్టు, పెద్ద బోనం, లగ్గం పట్నం, బోనాలు, నాగవెల్లి పట్నం నిర్వహించారు. గత వారం రోజులుగా ఈ ఉత్సవాలు కొనసాగుతుండగా బుధవారం ఎంఎల్‌ఏ మేడిపెల్లి సత్యం హాజరై పూజలు నిర్వహించారు.

గంగాధర: మండలంలోని కోట్లనర్సింహులపల్లెలో జరుగుతున్న బీరప్ప ఉత్సవాల్లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బుధవారం పాల్గొన్నారు. బీరప్ప కల్యాణ మహో త్సవం జరుగగా ఎమ్మెల్యే పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యేను కమిటీ నిర్వాహకులు, నాయకులు ఘనంగా సన్మానించారు.

'రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం'



మాట్లాడుతున్న మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్

కరీంనగర్ టౌన్, మే 22: రైతులు ఇబ్బందులు పడుతుంటే ఏమాత్రం పట్టించుకోకుండా వారిని జిల్లా మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మోసం చేశారని సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీలను అమలు చేయకుండా గ్యారంటీలను బుట్టదాఖలు చేసిందని విమర్శించారు. బుధవారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ళ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి సర్కార్ ఇప్పుడు కేవసలం సన్నరకాల ధాన్యానికే రూ.500 బోనస్ ఇస్తామనడాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. 500 బోనస్ పేరుతో కాంగ్రెస్ రైతులను దగా చేసిందని విమర్శించారు. జిల్లా ఇంచార్జి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లు రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర మంత్రులు పోటీపడి రాహుల్‌గాంధీకి డబ్బులు పంపే ధ్యాసలో ఉన్నారే తప్ప ప్రజలు, రైతుల సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని రవీందర్‌సింగ్ విమర్శించారు. తాలు, తేమ పేరిట రైతుల రక్తం తాగుతున్నారని, ధాన్యం అమ్ముకునేందుకు అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారని అన్నారు. ఇప్పటికీ రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఒక్క కరీంనగర్‌లోనే కొనుగోలు చేయాల్సి ఉందని, వెంటనే దాన్ని కొనుగోలు చేయాలని ఈసందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

టెండర్లు పెట్టి కమీషన్ల కోసం కక్కుర్తి పడితే ఊర్కొనే పరిస్థితి లేదని, సీబీఐ, ఇతరత్రా అధికారులకు ఫిర్యాదు చేసి రైసుమిల్లర్లపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా పోరాటం చేస్తామని రవీందర్‌సింగ్ స్పష్టం చేశారు. ఈవిలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, కెంసారపు తిరుపతి, తులా భాస్కర్‌రావు, జయంత్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సహాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

కరీంనగర్ క్రైం, మే22: హుజూరాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎల్.శంకర్ ఇటీవల మరణించగా ఆయన కుటుంబానికి ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ ఉద్యోగులు తమ ఒక్కరోజు వేతనాన్ని అందజేశారు. కరీంనగర్ ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ డేవిడ్ రవికాంత్, ఎక్సైజ్ ఉద్యోగుల ఒక రోజు వేతనం 4లక్షల 91వేల 304రూపాయల చెక్కును శంకర్ భార్యకు అందజేశారు. కరీంనగర్‌లోని ఎక్సైజ్ భవన్‌లో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఈ ఆర్థిక సాయాన్ని మృతుడి కుటుంబానికి అందజేశారు. ఈకార్యక్రమంలో కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్లు టి. శ్రీనివాసరావు, ఎ.సత్యనారాయణ, మహిపాల్‌రెడ్డి, పంచాక్షరీలతో పాటు ఎక్సైజ్ సీఐ అసోసియేషన్, ఎస్ఐ అసోసియేషన్, ఎక్సైజ్ మినిస్టీరియల్ అసోసియేషన్, ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ అసోసియేషన్ అధ్యక్షులు పులి నగేష్ పాల్గొన్నారు.

షిరిడి సాయి భజన మండలికి అరుదైన అవకాశం

కరీంనగర్ కల్చరల్, మే 22: తెలంగాణ తిరుపతిగా విరాజిల్లు తున్న స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కరీంనగర్‌కు చెందిన షిరిడిసాయి భజనమండలికి అరుదైన అవకాశం దక్కింది. బుధవారం భజన, సత్సంగం, హనుమాన్ చాలీసా పారాయణం చేసే మహదవకాశం దక్కింది. ఈ సందర్భంగా ఆలయ యాజమా న్యానికి, మానేపల్లి జ్యువెల్లరీ రామారావుకు భజన మండలి గౌరవాధ్యక్షుడు నలుమాచు చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నలుమాచు చంద్రశేఖర్‌తో పాటు నలుమాచు రాణి, శ్రీరాముల రాము, దయాసాగర్, హరిణి, కె సతీశ్, రామచందర్, రాణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రేణుకా ఎల్లమ్మ జాతర

మానకొండూర్, మే 22: మండలంలోని గంగిపల్లి, మద్దికుంట గ్రామాల్లో జరుగుతున్న రేణుకా ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం జాతర అంగరంగ వైభవంగా జరిగింది. మహిళలు బోనాలను ఎత్తుకొని డప్పు చప్పుళ్ళ మధ్య నృత్యాలు చేస్తూ ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ జాతరకు గంగిపల్లితో పాటు కొండపల్కుల, గట్టుదుద్దెనపల్లి, చెంజర్ల, దేవంపల్లి గ్రామాల భక్తులు మొక్కులు చెల్లించారు.

ఎస్‌యూకు పూర్తి స్థాయి వీసీని నియమించాలి

-ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరవింద్

గణేశ్‌నగర్, మే 22 : శాతవాహన యూనివర్సిటీకి పూర్తి స్థాయి వైస్ ఛాన్సలర్‌ను నియమించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా యూనివర్సిటీలకు ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్‌లను నియమించిందన్నారు. యూనివర్సిటీలు అభివృద్ధి పయనంలో నడవాలంటే పూర్తిస్థాయిలో రెగ్యులర్ వీసీ ఉండాలన్నారు. దాని ద్వారానే విశ్వవిద్యాలయం అభివృద్ధి పనుల్లో ముందుకు నడుస్తుందని వారు ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం సెర్చ్ కమిటీ వేసి ఇప్పటికే విసి పోస్టులపై కసరత్తు ప్రారంభించింది. కావున రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ జోక్యం లేకుండా విద్యావంతులైన వ్యక్తిని యూనివర్సిటీ విద్యని అభివృద్ధి చేసే వ్యక్తుల్ని నియమించాలని కోరారు. అదేవిధంగా అనేక సమస్యలతో యూనివర్సిటీ స్వాగతం పలుకుతున్నందున వాటి పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని విశ్వవిద్యాలయాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. రానున్న రోజుల్లో విశ్వవిద్యాలయాలు గొప్పస్థాయిలో ఉండబోతున్నాయని దానిలో విద్యార్థుల పాత్ర ఏ విధంగా ఉంటుందో దాన్ని అభివృద్ధి చేసే ప్రొఫెసర్లు, వైస్ ఛాన్సలర్ కూడా అదే స్థాయిలో విద్యార్థులకు అందుబాటులో ఉండాలన్నారు. ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయకుండా రెగ్యులర్ వైస్ ఛాన్సలర్‌ను నియమించి విద్యార్థులకు, యూనివర్సిటీకి ఉపయోగపడే విధంగా ఉండాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఎస్సారార్ ప్రిన్సిపాల్‌కు అవార్డు



కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

గణేశ్‌నగర్, మే 22: ఎస్సారార్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకృష్ణ ఉన్నత విద్యారంగంలో 25 సంవత్సరాలుగా చేసిన కృషిని ప్రశంసిస్తూ ఢిల్లీకి చెందిన వందనా సంస్థ, జి.సి.సీ.ఆర్ కౌన్సిల్ ఢిల్లీ సంయుక్తంగా రామకృష్ణకు ఇండియన్ ఐకాన్ అవార్డును ప్రకటించింది. ఈ నెల 19న ఢిల్లీ లో జరిగిన అవార్డు ప్రదానం కార్యక్రమం జరిగింది. ఈ సంద్భంగా జరిగిన అవార్డు ప్రదానంలో కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్. రామక్రిష్ణ విద్యారంగం ప్రగతికి చేస్తున్న సేవలను జిల్లా కలెక్టర్ అభినందించారు. జాతీయ స్థాయిలో ఇండియన్ ఐకాన్ అవార్డు రావడం పట్ల జిల్లా కలెక్టర్ తో పాటు, ఎస్‌ఆర్ ఆర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.రాజయ్య, డాక్టర్ ప్రమోద్, డాక్టరు కె. సురేందర్ రెడ్డి, డాక్టర్ కె మల్లారెడ్డి, స్టాఫ్ సెక్రెటరీ డాక్టరు ఆడేపు శ్రీనివాస్, డాక్టరు సతీష్ తదితరులు అభినందించారు.

నమ్మాళ్వార్ తిరునక్షత్రోత్సవం

కరీంనగర్ కల్చరల్, మే 22: నగర శివారులోని వేదభవనంలో 12 మంది ఆళ్వారులలో ఒకరైన నమ్మాళ్వార్ తిరునక్షత్రాన్ని (జయంతి) బుధవారం ఘనంగా నిర్వహించారు. సంతోష్‌కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో సేవాకాలం, కోయిల్ తిరువాయ్‌మొజి పారాయణం, నమ్మాళ్వార్‌లకు అభిషేకం జరిపారు. ఆళ్వార్ వైభవం, శ్రీసూక్తి సుధను హైదరాబాద్‌కు చెందిన కృష్ణమాచార్యులు వివరించారు. డాక్టర్ సంజీవరావు-పుష్పలత దంపతులు భోజన సౌజన్యాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో వికాసతంగిణి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె గౌతమరావు, యాద కిషన్‌తో పాటు సిరికొండ వేంకటేశం, రవీందర్‌రావు, గోపాల్‌రావు, భక్తులు సాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి



మాట్లాడుతున్న మిల్కూరి వాసుదేవరెడ్డి

జమ్మికుంట, మే 22: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసేదేవరెడ్డి అన్నారు. బుధవారం జమ్మికుంట పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వడ్లు పండించే ప్రతి రైతుకు క్వింటాల్‌కు 500 రూపాయలు బోనస్ ప్రకటించాలన్నారు. ఎన్నికలకు ముందు ఒక మాట, ఎన్నికల తర్వాత ఒక మాట మాట్లాడటం సరికాదన్నారు. సన్న వడ్లు పండించే రైతులకు ఖర్చు ఎక్కువ వస్తుందని, పంటకు రోగాలు ఎక్కువ వస్తాయని, సన్నాలు పండించేందుకు రైతులు తక్కువ ఆసక్తి చూపుతారనే విషయం ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. సన్న వడ్లకే బోనస్ చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించడం సిగ్గు చేటు అన్నారు. రైతులను మోసం చేస్తే ప్రభుత్వానికి సరైన రీతిలో బుద్ధి చెప్తారని గుర్తు పెట్టుకోవాలన్నారు. రైతాంగానికి నాణ్యమైన ఎరువులు, పురుగుల మందులు అందుబాటులో ఉండేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో శీలం ఆశోక్, జక్కుల రమేష్, సిరికొండ మదనయ్య, మారేపల్లి కిరణ్, కొడారి సురేష్, జక్కుల సాయిరాం, కల్లూరి శ్రీనివాస్, పుల్ల రజాక్, సురేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

పొలాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

హుజూరాబాద్‌రూరల్, మే 22: పొలంలో అక్రమంగా లారీ టిప్పర్లతో మట్టిని పోసి నాటును ధ్వంసం చేసిన డీబీఎల్ కంపెనీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతు కౌరు లింగారెడ్డి బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సింగాపూర్ గ్రామ శివారులో కౌరు లింగారెడ్డి తన కూతురు భూమిలో వ్యవసాయం చేస్తున్నాడు. అట్టి పొలం పక్కనే జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. కాగా తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తను నాటు వేసుకున్న భూమిలో అర్ధరాత్రి జాతీయ రహదారి నిర్మాణం కోసం టిప్పర్లతో మట్టిని పోసి పొలాన్ని ధ్వంసం చేశారని పేర్కొన్నారు. తన పొలంలో మట్టిని పోసి పొలాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరారు.

ఆర్థిక సాయం

శంకరపట్నం మే 22: శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలో ఇటీవల పూదరి శ్రీనివాస్ అకాల మరణం చెందాడు. కాగా బుధవారం అతని మిత్రులు జనగాం శ్రీనివాస్, చామంతుల రాజు, జక్కని శ్రీనివాస్, కొరిమి రాజు, కీసర సంపత్, ఆడెపు రవీందర్, పాంద్రాల రమేష్, జక్కోజు అనిల్, చామంతుల సంపత్ తదితరులు శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు రూ. 35వేలు అందజేశారు.

బీరన్న ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

హుజూరాబాద్, మే 22: హుజూరాబాద్ పట్టణంలో జరుగుతున్న బీరన్న ఉత్సవాలకు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీరన్నకు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఆ బీరన్నను కోరుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, యాదవ కులస్థులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

'బెల్టుషాపుల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు'

చిగురుమామిడి, మే 22: మండలంలో పలు గ్రామాల్లో బెల్టు షాపుల్లో మద్యం ఏరులై పారుతుందని, అయా గ్రామాల్లోని బెల్టు షాపుల్లో మద్యాన్ని అత్యధిక ధరలకు విక్రయిస్తున్నారని మండల ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు మిట్టపల్లి మల్లేశం అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామాల్లో మండల వ్యాప్తంగా దాదాపు వందకు పైగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఆయా గ్రామాల్లో మద్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఒక్కో క్వాటర్‌పై అదనంగా 15 నుంచి 20 రూపాయలు తీసుకుంటున్నారన్నారు. జూన్ 4 వరకు ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ మండలంలోని పలు గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్నారన్నారు. ఇదే విషయంపై గతంలో మండల సర్వసభ్య సమావేశంలో మండల సభ్యులు నిరసన తెలిపి, ఏకగ్రీవ తీర్మానం చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. వైన్స్ షాపుల యజమానులతో ఎక్సైజ్ శాఖ అధికారులు కుమ్మక్కై నెల వారీ మాముళ్ల మత్తులో మునుగుతున్నారని ఆరోపించారు. మండల ప్రజాప్రతినిదులు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోకపోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా గ్రామాల్లో, మండలంలో ఉన్న వైన్స్ షాపుల, బెల్టు షాపుల్లో అధిక ధరలకు మద్యాన్ని అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా కేంద్రంలో, మండల కేంద్రంలో అధికారులు, మద్యం షాపుల నిర్వహకుల వైఖరిపై ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో సదుపాయాలు కరువు



గద్దపాకలో సామూహికంగా పనిచేస్తున్న కూలీలు

శంకరపట్నం, మే 22: మండుటెండల్లో ఉపాధి పనిచేసే కూలీలు సదుపాయాల లేమితో అల్లాడుతున్నారు. శంకరపట్నం మండలం గద్దపాకలో వ్యవసాయ పనులు ముగియడంతో కూలీలు, రైతులు పెద్ద సంఖ్యలో ఉపాధి పనికి హాజరవుతున్నారు. పనిప్రదేశంలో సరైన సదుపాయాలు ఏర్పాటు చేయకపోవడంతో కూలీలు ఇబ్బంది పడుతున్నారు. కూలీలకు ఏవిధమైన కొలతలు ఇవ్వకుండా అందరితో సామూహికంగా పని చేయిస్తున్నారు. అందులో కొంత మంది మాత్రమే పనిచేస్తుండగా మిగతావారు తూతూ మంత్రంగా కాలం వెళ్లదీస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. కొలతలు లేకపోవడంతో అందరూ సమానంగా పనిచేయకపోవడంతో సరైన కూలీ గిట్టడం లేదని కూలీలు ఆవేదన చెందుతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సదుపాయాలు కల్పించి, పనిచేసే వారికి సరైనా కూలీ వచ్చే విదంగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, మే 22: ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను మల్కాపూర్ గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయం వద్ద బుధవారం పట్టుకున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. ట్రాక్టర్‌ను నడుపుతున్న డ్రైవర్, యజమాని అయిన ఎలగందుల గ్రామానికి చెందిన రాచకొండ సంపత్‌పై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

అన్నదానం

సుభాష్‌నగర్, మే22: మేము సైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం నాగిరేమణి, హరీష్, బుక్క మనోజ్‌కుమార్‌ల సహకారంతో నగరంలోని కూలి పని చేసుకునే చిరు వ్యాపారాలు చేసుకునే పేద వారికి అన్నదాన వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్న, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

బ్లూబెల్స్‌లో చిన్మయ వేసవి శిక్షణా శిబిరం ప్రారంభం



వేసవి శిక్షణా శిబిరం ప్రారంభంలో పాల్గొన్న బాధ్యులు

కరీంనగర్ టౌన్/సుభాష్‌నగర్, మే 22: నగరంలోని హనుమాన్ నగర్‌లో బ్లూబెల్స్ హైస్కూల్లో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో చిన్మయ మిషన్ నిర్వహణలో బుధవారం వేసవి శిక్షణా శిబిరం ప్రారంభమైంది. పది రోజుల పాటు ఉదయం 8-30 గంటల నుంచి 11-30 గంటల వరకు ఆటలు, కథలు, భగవద్గీత, భజనలు వంటి అంశాల్లో శిక్షణ అక్షయ చైతన్య గురువు ఆధ్వర్యంలో ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కరీంనగర్ విద్యార్థులు వినియోగించుకోవాలని గురువారం లోపు పాఠశాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కరస్పాండెంట్ జంగ సునీతామనోహర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు చందా విజయలక్ష్మి, జంధ్యం మాధవి, అక్షయ చైతన్య జంధ్యం మధూకర్, జలందర్, చందా రవీందర్, సూర గీత, పద్మావతి, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సైదాపూర్, మే 22: సైదాపూర్ మండలంలోని సోమారం గ్రామంలోని మోడల్ స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఫర్హానా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు తెలంగాణ మోడల్ స్కూల్ వెబ్ సైట్ ద్వారా ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 25లోపు ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రవేశం పొందిన బాలికల కోసం ఉచిత హాస్టల్ సౌకర్యం కూడా ఉంటుందని, పదోతరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు.

పలు రైళ్లు రద్దు

హైదరాబాద్, మే 22(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్, రెచ్నీ, కాజీపేట స్టేషన్‌లలో నాన్-ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలియజేశారు. మే27నుంచిజూన్ 30వరకు భద్రాచలం రోడ్-విజయవాడ-భద్రాచలం రోడ్(07278), (07979)రైళ్లు, సికింద్రాబాద్-వరంగల్ (07462) వరంగల్-హైదరాబాద్ (07463)రైలు, కాజీపేట-బల్లార్షా(17035)రైలు, మే27 నుంచి జులై1 వరకు బల్లార్షా-కాజీపేట (17036) రైలు, మే27నుంచి జూన్30 వరకు సిర్పూర్ టౌన్-కరీంనగర్ (07766), కరీంనగర్-బోధన్(07893)రైలు, మే28నుంచి జులై1 వరకు బోధన్-కరీంనగర్ (07893), కరీంనగర్-సిర్పూర్ టౌన్ (07765) రైళ్లను రద్దు చేసినట్టు రైల్వే అధికారులు తెలియజేశారు.

ఫొటోగ్రాఫర్స్‌కు అవగాహన సదస్సు

జమ్మికుంట రూరల్, మే 22: జమ్మికుంట పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మండల ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులకు కెనాన్ కంపెనీ ప్రతినిధులు బుధవారం అవగాహన కల్పించారు. కెనాన్ మెంటర్ ధనిశెట్టి రాంబాబు ఫొటోగ్రఫీలో లేటెస్ట్‌గా వస్తున్న ఫీచర్స్‌ను వివరించారు. పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఫొటోగ్రాఫర్స్ అప్‌డేట్ కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఏరియా సేల్స్ మేనేజర్ విష్ణురెడ్డి, మండల అధ్యక్షుడు చిన్నింటి నాగేంద్ర, ప్రధాన కార్యదర్శి బిట్ల తిరుపతి, శివన్న, విజయగిరి రాంబాబు, శ్రీధర్, అజార్, మారే జాన్, సందీప్, రవి పాల్గొన్నారు.

హనుమాన్ దీక్షాపరులకు భిక్ష

ఇల్లందకుంట, మే 22: మండలంలోని సిరిసేడు గ్రామానికి చెందిన మహ్మద్ సందాని (ఆటో డ్రైవర్) అనే ముస్లిం హనుమాన్ మాలదారణ స్వాములకు బుధవారం భిక్ష ఏర్పాటు చేశాడు. ఏనిమిదేళ్లుగా సందాని స్వాములకు భిక్ష పెడుతున్నారు. గ్రామంలో సుమారు 120మంది హనుమాన్ మాలదారణ వేసుకోగా వారికి భిక్ష పెట్టడం అభినందనీయమని పలువురు సందానిని అభినందించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

శంకరపట్నం, మే 22: శంకరపట్నం మండలం తాడికల్, ఇప్పలపల్లి గ్రామాల్లో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన బాధిత కుటుంబాలను బుధవారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతులకు గల కారణాలను అడిగి తెలుసుకొని ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ఇస్మాయిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరెల పంపిణీ

చొప్పదండి, మే 22: మండలంలోని రాగంపేటలోని హనుమాన్ ఆలయంలో పేద మహిళలకు చీరెలను పంపిణీ చేశారు. ఆలయ చైర్మన్ నలమాచు మనోహర్ తన వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంలోని 101 మంది పేద మహిళలకు చీరెలను పంపిణీ చేశారు,ఈ కార్యక్రమంలో ఎంపీటిసి సంగిరెడ్డి కృష్ణారెడ్డి, నలుమాచు రాధ, బొల్లం సరోజ, బైరి వెంకటసాయి పాల్గొన్నారు.